



కర్నూలు కలెక్టరేట్ వద్ద నిరసనలో మాట్లాడుతున్న గౌస్‌దేశాయి, హాజరైన సిపిఐ, ఇతర పార్టీల నాయకులు

ఎంపీ స్థానం ఎవరికి..?

- అభ్యర్థి ఎంపికపై టిడిపి కసరత్తు - ఓట్లున్నా పోటీకి అవకాశం దక్కని కురవలు
- పోటీకి సై అంటున్న ఆశావహులు - ముందు వరుసలో పంచలింగాల ఎంపిటిసి నాగరాజు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో రాజకీయ సమీకరణలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆశావహులు తమ అభిమతాన్ని నెరవేర్చుకోవడం తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ప్రధానంగా టిడిపిలో ఎంపి స్థానం ఎవరికి అన్న అంశంపై పెద్ద ఎత్తున ప్రజల్లో చర్చ సాగుతోంది....

జిల్లాలో అత్యంత బలమైన ఓటింగ్ శాతం కలిగిన సామాజిక తరగతిగా బిసిలు ఉన్నారు. ప్రధానంగా బోయ, కురువ, యాదవ కులాలు ఉన్నాయి. బలమైన సామాజిక తరగతిగా కురువలు ఉన్నప్పటికీ రాజకీయపరంగా దశాబ్దాల తరబడి వివక్షతకు గురవుతున్నామని ఆ సామాజిక తరగతి నుంచి బలమైన విమర్శ వినిపిస్తోంది. కిందిస్థాయిలో సర్పంచులుగా, జడ్‌పిటిసిలుగా పోటీ చేసే అవకాశం లభించినప్పటికీ ఎంపి స్థానం విషయంలో మాత్రం వారికి మొండిచేయి ఎదురవుతూనే వస్తోంది. జిల్లాలో ఇదివరకే బోయలు మంత్రి పదవులను సాధించగలిగారు. ఏది ఏమైనా రానున్న ఎన్నికల్లో కురవలు ఒక ఎంపి స్థానాన్ని, రెండు ఎమ్మెల్యే స్థానాలను తమకే కేటాయించాలని పట్టుబడుతున్నారు. ఇప్పటికే కురువ సంఘాలు ఈ అంశాన్ని తీర్మానించి లక్ష్యం వైపుగా అడుగులు వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు సైతం ఆలోచనలో పడ్డాయి. జిల్లాలో ఇప్పటికే కురవలు వివిధ పార్టీల్లో 23 సర్పంచులు, 86 ఎంపిటిసి స్థానాల్లో పాలన సాగిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ఇది కురువలకు సానుకూల అంశం కానుందని వారు భావిస్తున్నారు. టిడిపి ప్రస్తుతం ఇదే ఆలోచనలో ఉన్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే స్థానాల సంగతి అటుంచితే ప్రస్తుతం జిల్లాలో టిడిపిలో ఎంపి సీటు అంశంపై జోరుగా చర్చ సాగుతోంది. ఇప్పటికే ఎంపి స్థానానికి బోయలకు అవకాశం ఇచ్చినా విజయం సాధించలేకపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టిడిపి తన ఆలోచనను మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో కురువ సామాజిక తరగతి నుంచి ప్రధానంగా పంచలింగాల ఎంపిటిసి కురువ నాగరాజు సహా మరో ఇద్దరు ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు, మరో మాజీ ఎంపీ కూడా గట్టిగా కృషి చేస్తున్నట్లు సమాచారం.



టిడిపి అధినాయకత్వం ఎవరి వైపు ?

కర్నూలు ఎంపి టికెట్‌ను ఇప్పటి వరకు కోట్లజయ సూర్య ప్రకాష్ రెడ్డికి ఇస్తారనే వాదన వినిపిస్తూ ఉండేది కానీ ఆయనతో పాటు ప్రస్తుతం కర్నూలు మండలం పంచలింగాల ఎంపిటిసిని మూడు, నాలుగు సార్లు పిలిచి చర్చించినట్లు సమాచారం. దీంతో ఆ పార్టీలో సమీకరణలు మారుతున్నాయన్న చర్చ కొనసాగుతోంది. సామాజిక తరగతి బలం, ఆర్థిక బలం ఉన్న వ్యక్తులయితే గెలుపునకు అవకాశాలు మెండుగా ఉంటాయని టిడిపి అధిష్టానం, కార్యకర్తలు భావిస్తున్నట్లు పార్టీలో బహిరంగ చర్చ సాగుతోంది.

ఎమ్మెల్యే ఆశావహుల మొగ్గు ఎవరి వైపు ?

ప్రస్తుతం రాజకీయాలు అత్యధికంగా ఆర్థిక, సామాజిక బలం పునాదులపైనే ప్రభావితమవుతున్నాయన్న నేపథ్యంలో ఆ పార్టీ తరపున ఎమ్మెల్యే సీటును ఆశిస్తున్న ఆశావహులు సరిగా ఇదే అంశాన్ని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అలాంటి అభ్యర్థికే ఎంపి సీటు దక్కాలన్న ఆకాంక్షను చాలా మంది ఎమ్మెల్యే ఆశావహులు కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. తాము పోటీ చేసే ప్రతి నియోజకవర్గానికి రూ.ఐదారు కోట్లు కలిసి వస్తాయని యోచిస్తున్నట్లు సమాచారం. కురువ సామాజిక తరగతి అయితే ప్రతి నియోజకవర్గానికి సుమారు 30 వేల నుండి 50 వేల ఓట్లు కలిసి వస్తాయని చర్చ సాగుతున్నట్లు సమాచారం. సరిగ్గా ఈ రెండు అంశాలు ఎంపి సీటును ఆశిస్తున్న నాగరాజుకు అనుకూలంగా ఉన్నాయి. నాగరాజును బలపరుస్తూ కురువ సంఘాలు ఇప్పటికే తీర్మానం చేసినట్లు తెలుస్తోంది. మరో వైపు ఆర్థికంగాను స్థిరపడి ఉన్నారు. వీటికి తోడు వ్యక్తిగతంగా ఆయన ఉన్నత విద్యావంతుడుగా, సహనశీలిగా, సౌమ్యునిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. ఎంపీ ఎన్నికలు ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో పార్టీ శ్రేణులు కూడా ఆయన అభ్యర్థిత్వాన్ని కోరుకుంటున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ మేరకు ఆయన ప్రొఫైల్‌ను కూడా పార్టీ పరిశీలించి సుముఖంగా ఉన్నట్లు చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఎంపి సీటు అవకాశం ఆయనకే దక్కనుందన్న వినికిడి ప్రజల్లో బలంగా వినిపిస్తోంది. కాగా టిడిపి అధినాయకత్వం ఎవరి వైపు మొగ్గుచూపనుందో, అభ్యర్థిత్వం ఎవరికి ఖరారు కానుందో పార్టీ అధిష్టానం ప్రకటించేదాకా వేచి చూడాల్సిందే.



అలీన విధానాన్ని తుంగలో తొక్కిన మోడీ

- పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి ఆపాలి - వామపక్ష పార్టీలు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

భారతదేశ అలీన విధానానికి ప్రధానమంత్రి మోడీ తుంగలో తొక్కారని వామపక్ష పార్టీలు సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఎస్‌యుసిఐ నేతలు పేర్కొన్నారు. పాలస్తీనా పై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పాలస్తీనా పై ఇజ్రాయిల్ నిర్వహిస్తున్న దాడులను ఖండిస్తూ నిరసన తెలిపారు. సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శిలు కె.రాముడు , రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మునెప్ప, ఎస్‌యుసిఐ నాయకులు నాగన్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు నరసింహ మాట్లాడారు. గత కొన్ని రోజులుగా పాలస్తీనా ప్రాంతంపై ఇజ్రాయిల్ నిర్వహిస్తున్న దాడులు సరైంది కాదన్నారు. సామ్రాజ్యవాద దేశాల బలంతో ఈ దాడులకు ఇజ్రాయిల్ పూనుకుంటుందన్నారు. పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేపడుతున్న దాడుల వల్ల ఇప్పటికే 10,000 మంది ప్రజలు చనిపోయారని, వారిలో 5000 మంది పిల్లలు ఉన్నారన్నారు. 25 వేల మంది గాయపడ్డారని ఇంకా ఆచూకీ తెలియని వారు వేలాదిమంది ఉన్నారని ఇంత దుర్మార్గంగా దాడులుజరుగుతున్న పట్టించుకునే నాథుడే లేడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా సామ్రాజ్యవాదం తన ఆయుధాల వ్యాపారం కోసం పాలస్తీనాలో కంటిన్యూగా దాడులు జరగడానికి ఇజ్రాయిల్‌ను ప్రోత్సహిస్తుందని, ఆయుధాలను సరఫరా చేస్తుందన్నారు. అమెరికా తన వైఖరి మార్చుకోవాలని వారు డిమాండ్ చేశారు. హమాస్ దాడులు చేయడం వల్లనే ఇదంతా జరిగిందని కొంతమంది కళ్ళు లేని కుబేరులు వాదిస్తున్నారన్నారు. ఐక్యరాజ్యసమితిలో ఓటింగ్ జరిగితే 120 దేశాలు పాలస్తీనాకు అండగా నిలిస్తే భారతదేశం తటస్థ వైఖరి అనుసరించడం దుర్మార్గమైన చర్యఅని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని 50,000 మంది ప్రజలు ఉంటే నాలుగు లెట్రిన్లు మాత్రమే ఉన్నాయని, ఆసుపత్రిలో ఎటువంటి సౌకర్యాలు లేవన్నారు. కనీసం తాగడానికి నీళ్లు లేవని, మందులు లేవు మత్తుమందు లేకుండానే ఆపరేషన్ చేస్తే పరిస్థితి కొనసాగుతున్న వైద్యానికి మందులు అందించే అవకాశమే లేదన్నారు. గాజా ప్రాంతాన్ని ఆ రకంగా ఇజ్రాయిల్ సెన్నాలు చుట్టుముట్టి ఏ ఒక్కరు కూడా సహాయం అందించకుండా అడ్డుకుంటున్నారన్నారు. ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని ప్రత్యేక దళాలను పంపించి పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని కోరారు. ప్రజల పట్ల మనుషుల పట్ల బాధ్యత ఉన్న రాజకీయ పార్టీలుగా వామపక్ష పార్టీలు ప్రజలకు అండగా నిలుస్తున్నాయని, ప్రజలందరూ కూడా పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలియజేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ ,నగర నాయకులు విజయ్, షరీఫ్ సాయిబాబా , వెంకటరాముడు , సిపిఐ నగర్ నాయకులు చంద్రశేఖర్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వెంకటేశ్వర్లు, ఎస్‌యుసిఐ నాయకులు తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

అర్థమయ్యే రీతిలో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలి

- జెసి నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి - ఆదోని

అర్జీదారునికి అర్థమయ్యే రీతిలో నాణ్యతతో కూడిన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని జెసి నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని సిల్వర్ జూబ్లీ హాలులో 'జగనన్నకు చెబుదాం - స్పందన' నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను జెసి నారపురెడ్డి మౌర్య స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'జగనన్నకు చెబుదాం-స్పందన'లో వచ్చిన అర్జీలకు సంబంధిత అధికారులు ఎలా అంటే అలా ఎండార్స్‌మెంట్ ఇవ్వకుండా ప్రజలకు అర్థమయ్యే రీతిలో ఇవ్వాలని తెలిపారు. అప్పుడే రీఓపెన్ కేసుల శాతం తగ్గే అవకాశముందని చెప్పారు. అర్జీల్లో రెవెన్యూకు సంబంధించి మిగులు భూమి, అడంగల్ కరెక్షన్స్ లాంటి పరిష్కారమయ్యే చిన్న, చిన్న సమస్యలకు కూడా అర్జీదారులు కర్నూలుకు వచ్చి మరి అర్జీలు ఇస్తున్నారని తెలిపారు. ఇక్కడ పరిష్కారమయ్యే వాటికి ఇక్కడే పరిష్కారం చేయాలని, పరిష్కారం చేయలేని వాటికి ఎందుకు చేయలేకపోతున్నామనేది కూడా స్పష్టంగా ఎండార్స్‌మెంట్‌లో వివరించాలని సూచించారు. లబ్ధిదారులకు కేటాయించిన టిడ్కో ఇళ్లలో 3 నెలల నుంచి విద్యుత్ బిల్లులు కట్టలేదని, వారి ఇళ్ల వద్దకు వెళ్లి కనెక్షన్ కట్ చేస్తున్నారని మీడియా ప్రతినిధులు స్పందనలో జెసి దృష్టికి తీసుకొచ్చారు. అలాంటి సమస్యలపై తగిన చర్యలు తీసుకొని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని జెసి తెలిపారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, ఆదోని తహశీల్దార్ వెంకట లక్ష్మీ, ఆదోని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఎంపిడిఒ గీతావాణి ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెసి

13న పాఠశాలలకు దీపావళి సెలవు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 13న జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు దీపావళి సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వెంకట రంగారెడ్డి శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 24 నుండి డిసెంబర్ ఆరవ తేదీ వరకు విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ముగ్గురికి జెవెల్ ఆఫ్ కర్నూలు పురస్కారాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జాతీయవిద్యా దినోత్సవం, అల్పసంఖ్యాక దినోత్సవాన్ని పురస్కరించుకొని జెవెల్ ఆఫ్ కర్నూలు పురస్కారానికి ముగ్గురిని ఎంపిక చేస్తూ కర్నూల్ మేధావుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు మన్సూర్ రహ్మాన్, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముగ్గురిని 'కర్నూలు జిల్లా రత్నాలు' (Jewels of Kurnool) అవార్డులతో గౌర విస్తున్నట్లు ఆచార్య మన్సూర్ రహ్మాన్, చంద్ర శేఖర కాల్కూర తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంలో కీలక శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఐఎఎస్ అధికారి ఎండి.ఇంతియాజ్ , రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఎ. ఆనందరావు, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ఫజులుల్ రెహమాన్లను ఎంపిక చేసినట్లు వారు వెల్లడించారు. వారు చేసిన సేవలను గుర్తించి ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. వారికి డిసెంబర్ 2వ వారంలో పురస్కారాలను అందజేస్తామన్నారు.





చెకుముకి టాలెంట్ టెస్టుకు అనూహ్య స్పందన

- 15 వేలమంది విద్యార్థులు హాజరు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ పరీక్ష కు అనూహ్య స్పందన లభించింది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షను జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో నిర్వహించారు. ఈ పరీక్షకు దాదాపుగా 15000 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. కర్నూలు ఆదోని ఎమ్మిగనూరు, పత్తికొండ డివిజన్ కేంద్రాల్లోని పాఠశాలల్లో ఈ పరీక్షలను జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చేపట్టారు. కర్నూలు నగరంలో నిర్వహించిన ఈ పరీక్షను జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుధీర్ రాజు, ఖాజా హుస్సేన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ సంబరాల్లో భాగంగా టాలెంట్ పరీక్షను నిర్వహిస్తామన్నారు. మండల, జిల్లా , రాష్ట్రస్థాయిలో ఈ సైన్సు సంబరాలను నిర్వహించి విద్యార్థులకు ప్రత్యేకంగా బహుమతులను కూడా అందజేస్తామన్నారు. ఈ ఏడాది నిర్వహించిన పరీక్షకు వేలాది మంది విద్యార్థులు హాజరై పరీక్షలో భాగస్వామ్యం కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులపై విస్తృతంగా చర్చ పెట్టి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ పరీక్ష నిర్వాహణలో భాగస్వాముమైన ఉపాధ్యాయులకు వారు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.


పరీక్షలకు హాజరయిన విద్యార్థులు



నూతన కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బివై. రామయ్య,

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలో ఏర్పడిన కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు నగర మేయర్ బివై. రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం 19వ వార్డు మథర్ ల్యాండ్ నందు రూ.65 లక్షలతో సిసి డ్రైన్ నిర్మాణానికి మేయర్, ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర శివార్లలో అనతి కాలంలోనే అనేక కాలనీలు ఏర్పడ్డాయని, అందుకు తగ్గట్టుగా అక్కడ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నగరంపై చూపిన చిన్నచూపు కారణంగా ఇప్పటికి ఎన్నో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.గోపాల్ రెడ్డి, కార్పొరేటర్ లక్ష్మిరెడ్డి, ఎంఇ శేషసాయి, డిఇఇ రవిప్రకాష్ నాయుడు, ఎఇ జనార్ధన్, ఇంస్పెక్టర్లు రఫిక్, ఆర్.రాజు, నాయకులు అనిల్ కుమార్, బాబుల్ రెడ్డి, లక్ష్మీపతి, తిరుపాలు, చిన్న, రసూల్, శ్రీనివాస యాదవ్, రాజేష్, సంతోష్, రమణ పాల్గొన్నారు.

రాష్ట్రానికి సిఎం జగన్మోహన్ రెడ్డి అవసరం : శ్రీదేవి


పథకాలు వివరిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి-పత్తికొండ

అన్ని వర్గాల ప్రజలకు మంచి చేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల్లోనూ గెలవాల్సిన అవసరం ఉందని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు . శుక్రవారం పత్తికొండలో పండుగలా 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీదేవి ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు. నాయకులు, కార్యకర్తలు, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధి గురించి అవగాహన కల్పించారు. పత్తికొండ ఎంపిపి నారాయణదాసు మాజీ ఎంపిపి నాగరత్నమ్మ, సర్పంచి కొమ్ము దీపిక, మండల కన్వీనర్ కారం నాగరాజు, అధికార ప్రతినిధి శ్రీరంగడు ఎంపిటిసి నీలకంఠ, టిఎంటి హుస్సేన్, ఎంపిడిఒ కవిత వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే జగన్‌ను గెలిపిస్తాయి : ఎమ్మెల్యే

సి బెళగల్ : సంక్షేమ పథకాలు మళ్లీ జగనన్నను గెలిపిస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం బెళగల్ లో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం చేపట్టారు. ఇక్కడే ప్రజలకు అనేక పథకాలు అందుబాటులోకి తెచ్చారని, టిడిపి రాష్ట్రానికి చేసిందేమి లేదని, అందుకే వచ్చే ఎన్నికల అనంతరం టిడిపి మనుగడ ఉండదని అన్నారు. ప్రజలు జగనన్నకు బాసటగా ఉండాలని అందులో మహిళలు వేసే ఓటు వైసిపికి కీలకమని పేర్కొన్నారు.

నిండు మనసుతో సీఎంను దీవించండి: సుధాకర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు మండలం గార్గేయపురం గ్రామం సచివాలయంలో – 1 పరిధిలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ గడపగడపకు వెళ్ళి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్ లెట్లను అందజేశారు. ఎమ్మెల్యేకు మహిళలు హారతులు పడుతూ, వైసిపి నాయకులు పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. సిఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజలంతా నిండు మనసుతో జగనన్నను ఆశీర్వదించి మళ్లీ జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. బి తాండ్రపాడులో సర్పంచు సోమేశ్వరమ్మ, ఎంపిపి వెంకటేశ్వరమ్మ, ఎంపిటిసి జ్యోతిలతా, సింగిల్ విండో చైర్మన్లు వినయ్ కుమార్ రెడ్డి, శేషి రెడ్డి, ఎల్ల నాగిరెడ్డి, విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు రవి శాస్త్రి, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, సురేష్, యేసేపు, శేఖర్, శీను, శివరాముడు, గోవర్ధన్, విద్య సాగర్, అనిల్, చంద్, మండల అధికారులు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


గజమాలతో ఎమ్మెల్యే సుధాకర్‌కు సన్మానం


పెద్దపాడులో టిడిపి మేనిఫెస్టో వివరిస్తున్న గౌరుచరిత

టిడిపి తోనే రాష్ట్ర అభివృద్ధి : గౌరుచరిత

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్ : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ పాణ్యం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరి చరిత రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 36 వ వార్డ్ పెద్దపాడు గ్రామంలో బాబు షురిటీ–భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటిటికి తిరిగి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి గౌరు చరిత ప్రజలకు వివరించారు ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జి పెద్దపాడు తిరుమలేశ్వర్ రెడ్డి, పెద్ద బీచుపల్లి, చిన్న బీచుపల్లి, మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, మాజీ ఎంపిపి వాకటి మాధవి, మాదేష్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్, సల్కాపురం దేవేందర్ రెడ్డి,మైనారిటీ నాయకులు దొడ్డిపాడు మహబూబ్ బాషా, అర్బన్ నాయకులు ధనుంజయ పాల్గొన్నారు.



సి.బెళగల్ ఎంపిపి హాలులో మాట్లాడుతున్న ఆర్‌డిఒ ప్రసాద్

ప్రత్యేక ఓటు నమోదులో అశ్రద్ధ వహిస్తే చర్యలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలో ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా బిఎల్‌ఒ లు అశ్రద్ధవహిస్తే చర్యలు తప్పవని ఆర్‌డిఒ హరిప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం ఎంపిపి కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణి,ఇఒఆర్‌డి సందీప్, ఎంపిపి బొంతల మునెప్పల సమక్షంలో సిబ్బందితో సమీక్షించారు. మండలంలో చనిపోయినవారి ఓట్లు, కొత్తగా చేర్పులు, పేర్లలో మార్పులు, ఏరివేత వంటివి వచ్చే నెల 9 లోపు పూర్తి చేయాలని అన్నారు. బిఎల్‌ఒ లు మెలకువలు పాటించి అశ్రద్ధవీడాలని జనవరి 5న ఓటు సమగ్రత లక్ష్యం నెరవేర్చాలన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభ లోగో ఆవిష్కరణ

ం.

డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున హాజరు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : ఎస్‌ఎఫ్‌ఐ కర్నూల్ జిల్లా 47వ మహాసభలు డిసెంబర్ 2 ,3 తేదీలలో కర్నూలు నగరంలో జరుగుతున్నాయి. శుక్రవారం మహాసభల లోగోను హంద్రీనీవా డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, హంద్రీనీవాడైరెక్టర్ ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జిల్లా కార్యదర్శి మురళి ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ కర్నూలు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని విద్యార్థులను కోరారు. అధ్యయనం పోరాటం నినాదంతో 1970లో స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం అనే దీర్ఘకాలిక లక్ష్యాలతో భగత్ సింగ్ , అల్లూరి సీతారామరాజు , సుభాష్ చంద్రబోస్ , లాంటి పోరాట యోధుల ఆశయ సాధన కోసం ఎస్‌ఎఫ్‌ఐ పోరాటం చేస్తుందన్నారు. దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎస్‌ఎఫ్‌ఐ ఉందన్నారు. దేశానికి ఎందరో మేధావులను డాక్టర్లను రాజకీయ నాయకులను ఉపాధ్యాయులను అందించిన ఘనత ఈ సంఘానికి ఉందన్నారు. విద్యారంగంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు ఎప్పటికప్పుడు విద్యార్థి లోకానికి తెలియజేసి విద్యార్థులకు నష్టం కలిగించే విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. పేద ప్రభుత్వ ఉద్యోగిని, విద్యా వ్యతిరేక విధానాలు వ్యతిరేకంగా విద్యార్థులను ప్రజలను ఐక్యపరిచి విద్యారంగా పరిరక్షణకు ఉద్యమిస్తుందని తెలిపారు.ఎస్‌ఎఫ్‌ఐ కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప , అబ్దుల్లా ,నగర అధ్యక్ష కార్యదర్శులు అమర్, సాయి ఉదయ్, నగర ఉపాధ్యక్షులు మల్లేష్ , అబూబకర్ నగర సహాయ కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నార



ఎస్‌ఎఫ్‌ఐ మహాసభ లోగోను ఆవిష్కరిస్తునన మల్లికార్జున, మురళి, నాయకులు


మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు బాబురావు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : బాబురావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : మహిళలు అన్ని రంగాలలో రాణించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె. బాబురావు అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ సమావేశంలో బాబురావు మాట్లాడారు. జిల్లాలో గ్రామస్థాయి, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి మహిళా కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, కాంగ్రెస్ సమావేశాలకు మహిళలను అధిక సంఖ్యలో పాల్గొనేటట్లు చూడాలన్నారు. మహిళల సమస్యలను తమ దృష్టికి తీసుకుని వస్తే జిల్లా కాంగ్రెస్ కమిటీ పరిష్కరిస్తుందన్నారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ప్రమీల, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, డిసిసి కార్యదర్శులు రియాజ్ , లాజరస్, జసేవాదళ్ జిల్లా అధ్యక్షురాలు ఏ వెంకట సుజాత, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ హై, మహిళ నాయకులు పుష్పలీల, కెవి.లక్ష్మి రాజేశ్వరి, హైమావతి, లలిత, ఆయ్యమ్మ ,లక్ష్మీదేవి, ఎల్లమ్మ, మద్దమ్మ, ఆశాలత పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి... - వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

పాలస్తీనాపై ఇజ్రాయిల్ కాల్పులు ఆపి శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు, రామాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్ బాబు, సిపిఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు తెలిపారు. శుక్రవారం వామపక్షాల ఆధ్వర్యంలో నాయకులు సుదర్శన్, లింగన్న అధ్యక్షతన ఆదోని మున్సిపల్ మైదానం నుంచి ర్యాలీగా వెళ్లి భీమాస్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గాజాలు మహిళలకు, చిన్న పిల్లలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పాలస్తీనాకు వామపక్షాలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాయని అన్నారు. సిపిఎం జిల్లా నాయకులు ఈరన్న, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు కుమారస్వామి, విజయ్, హర్షిత్, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి బి.వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఒబి.నాగరాజు, వైట్ భీమేష్ జిల్లా సమితి సభ్యులు షేక్షావలీ, సిపిఐ నాయకులు మెకానిక్ వలీ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దస్తగిరి, ఎఐవైఎఫ్ నాయకులు గిరి మల్లప్ప, సిపిఎం నాయకులు రామాంజి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** సోమప్ప సర్కిల్లో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వామపక్ష నాయకులు గోవిందు, రంగన్న, రాముడు, ఏసోబు, అబ్దుల్లా, సిపిఐ నాయకులు రంగన్న, జబ్బార్, ఎంఎల్ పార్టీ నాయకులు మహేంద్ర పాల్గొన్నారు. **ఆలూరు** అంబేద్కర్ సర్కిల్లో నిరసన చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి షాకీర్, సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, సిపిఎం హాలహర్వి మండల కార్యదర్శి కృష్ణ, సిపిఐ తాలూకా నాయకులు భూపేష్, నాయకులు రంగస్వామి, సిద్ధు, సిపిఎం నాయకులు విఠల్, డివైఎఫ్ఐ నాయకులు మైనా, గోవర్ధన్ పాల్గొన్నారు.


ఆదోనిలో నిరసన తెలుపుతున్న నాయకులు


ఎమ్మిగనూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ నుంచి గోనెగండ్ల బైపాస్ రోడ్డు వరకు సెంటర్ లైటింగ్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణాన్ని ఒక ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని, పట్టణ అభివృద్ధి వైసిపితోనే సాధ్యమని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు, వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.

ఉరుకుందలో వేలం పాటలు

ప్రజాశక్తి - కౌతాళం


వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రంలో ఒకటైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో తలనీలాలు పోగు చేసుకోవడానికి, దేవస్థాన పాత పరిపాలన భవనం పడగొట్టడానికి శుక్రవారం వేలంపాటలు నిర్వహించారు. కర్నూలు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దేవాలయ సహాయ కమిషనర్ వాణి బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. తలనీలాలు పోగు చేసుకునే హక్కు ఒక సంవత్సరకాలానికి బహిరంగ వేలంలో నలుగురు పాల్గొన్నారు. రాజా ఎంటర్ప్రైజెస్ హిందూపూర్ వారు రూ.1,63,80,000 దక్కించుకున్నారు. దేవస్థాన పాత కార్యాలయం పరిపాలన భవనం పడగొట్టడానికి బహిరంగ పాల్గొనగా కర్నూలు నగరానికి చెందిన సురేష్ కుమార్ రూ.3.44 లక్షలకు దక్కించుకున్నారు. ఈ వివరాలను దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపుతామని దేవాలయ సహాయ కమిషనర్ వాణి తెలిపారు. దేవాలయ పర్యవేక్షకులు రామ్మోహన్, వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, దేవాలయ ఇన్స్పెక్టర్ వీరేష్ పాల్గొన్నారు.

కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని


వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ఆదోనిలోని పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సిపిఎం సీనియర్ నాయకులు ఈరన్న, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న, కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదోని ఆర్ట్స్ కళాశాల సిల్వర్ జూబ్లీ హాలులో జరిగిన 'జగనన్నకు చెబుదాం, స్పందన'లో జెసి నారపురెడ్డి మౌర్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో రోడ్డు వెడల్పు చేయాలని, అన్ని వీధుల్లోనూ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని కోరారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని, బైపాస్ రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. టెక్స్ టైల్ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఆదోని ప్రభుత్వాసుపత్రి, స్త్రీలు, చిన్నపిల్లల ఆస్పత్రిలో అన్ని విభాగాల్లో సిబ్బందిని నియమించాలని, మెరుగైన వైద్య పరికరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాస్పత్రిలో సిటి స్కానింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని, పట్టణంలో అదనంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నిర్మించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో చెత్త పన్ను రద్దు చేయాలని, విద్యుత్ చార్జీలు, ఆస్తి పన్ను తగ్గించాలని కోరారు. పట్టణంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలిపారు.

వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు : ఎపిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి


నేమకల్లులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వలసలు వెళ్లకుండా తక్షణమే ఉపాధి హామీ పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ఎపిఒ మాధవ శంకర్ తెలిపారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేమకల్లు, సంగాల గ్రామాలలో కొండ రాయి కొట్టుకునే వారు మాత్రమే వలస వెళ్లారని తెలిపారు. ఉపాధి హామీ పనులు చేసుకునే వారు ఎవరూ వెళ్లడం లేదని, గ్రామంలో ఉపాధి పనులు విరివిగా సాగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కరువు మండలాల్లో తక్షణమే ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏ గ్రామంలోనైనా సరే వలసలు వెళ్లకుండా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మారుతి


సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ నిరంతరం కొనసాగిస్తున్న మారణకాండను తక్షణమే ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజి బాబు, జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, మండల కార్యదర్శి బి.రాముడు కోరారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాలస్తీనాపై దాడుల వల్ల 10 వేల మంది ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. తక్షణమే ఇజ్రాయిల్ సైన్యం కాల్పులు ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు రాజు, షబ్బీర్, ఆది, నాగరాజు, తిక్కయ్య, ఈరన్న గౌడ్ పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం భూముల పరిశీలన

ప్రజాశక్తి -పెద్దకడబూరు

మండలంలోని గవి గట్టు గ్రామ సమీపంలో రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం స్వీకరించిన భూములను తహశీల్దార్ వీరేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో జెసి నారపురెడ్డి మౌర్య శుక్రవారం పరిశీలించారు. భూములకు సంబంధించిన రికార్డులు సైతం పరిశీలించారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, మండల సర్వేయర్ తేజస్విని పాల్గొన్నారు.


భూములను పరిశీలిస్తున్న జెసి

అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


లూకా పాసియోలికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి అధ్యక్షతన కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఇర్ఫాన్, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి విజయ్ కుమార్ మాట్లాడారు. లూకా పాసియోలి అకౌంటింగ్ విధానంలో జంట పద్దు విధానాన్ని ప్రవేశపెట్టి అకౌంటింగ్ సబ్జెక్టు రూపకల్పనకు విశేషంగా కృషి చేశారని తెలిపారు. నేడు మారుతున్న సాంకేతికత వల్ల వివిధ వ్యాపారాలు ఈ-కామర్స్ విధానంలో, డిజిటల్ చెల్లింపు ద్వారా జరుగుతున్నాయని చెప్పారు. ఈ ఆధునిక టెక్నాలజీలో అకౌంటింగ్ ప్రాధాన్యత చాలా ఉందని, జిఎస్టి రాకతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చాలా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు అకౌంటెన్సీ సబ్జెక్టు పట్ల శ్రద్ధ చూపుతూ వివిధ పరిశోధనల వైపు వెళ్లాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్, నోడల్ ఆఫీసర్ రాఘవేంద్ర, వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు వీరేష్, మనోహర్, విజయరాజు పాల్గొన్నారు.

తుంగభద్ర డ్యాంలోకి నీటి చేరిక

ప్రజాశక్తి - ఆదోని

గత మూడు, నాలుగు రోజులుగా తుంగభద్ర పైప్రాంతంలో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో జలాశయానికి వరద నీటి చేరిక పెరిగినట్లు బోర్డు అధికారులు తెలిపారు. తాజాగా తుంగభద్ర డ్యామ్‌లో మరో 6,190 క్యూసెక్కుల నీరు చేరినట్లు శుక్రవారం బోర్డు అధికారులు వివరించారు. 20 రోజులుగా తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో 'సున్నా' స్థాయికి పడిపోయింది. ఉన్న నీటినే ఆచితూచి వాడుకునే పరిస్థితి నెలకొంది. గురువారం నాటికి జలాశయానికి సుమారు 4,077 క్యూసెక్కుల వరద నీరు చేరడంతో ఆయకట్టు రైతులకు మళ్లీ ఊపిరి వచ్చినట్లయ్యింది. మళ్లీ శుక్రవారం నాటికి మరో 6,190 క్యూసెక్కుల నీరు పచ్చి చేరడంపై బోర్డు అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాగే మరికొన్ని రోజుల పాటు తుంగభద్ర డ్యాంకు నీటి చేరిక కొనసాగితే ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు చేతికి వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 1,602.96 అడుగులకు నీటి మట్టం పడిపోగా 25.59 టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉంది. జలాశయం కింద వివిధ కాలువలకు 9,362 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తుండగా, గురువారం ఉదయం నుంచి జలాశయానికి 10,200 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 1631.93 అడుగుల మేర నీరు నిల్వ ఉండగా, 101.50 టిఎంసిలతో జలాశయం తొణికిసలాడుతుండేది. ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతుండడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. గత రెండు రోజుల నుంచి తుంగభద్ర డ్యాంలోకి సుమారు 10 వేల క్యూసెక్కులు వచ్చి చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాట తప్పని ఏకైక ముఖ్యమంత్రి జగన్

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి -పెద్దకడబూరు


మాట ఇస్తే తప్పని వ్యక్తి ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం పెద్దకడబూరులో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. షాదీఖానా భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి హాజరయ్యారు. ముందుగా స్థానిక ఎస్సీ కాలనీ నుంచి బస్టాండ్ వరకు వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ ఛైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు వివిధ గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చేతులమీదుగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి మరోసారి జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. జడ్పిటిసి జాము రాజేశ్వరి, మాజీ ఎంపిపి రఘురాం, జెసిఎస్ కన్వీనర్ రవిచంద్ర రెడ్డి, ఎంపిడిఒ ప్రభాకర్, సర్పంచి రామాంజనేయులు, కోసిగి మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ ముక్కరన్న, కోసిగి మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ బొగ్గుల అర్లప్ప పాల్గొన్నారు. **నందవరం** సచివాలయం-2లో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మాట్లాడారు. ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా, కుల, మత, ప్రాంత, వర్గ, పార్టీల తేడా లేకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. వైసిపి సీనియర్ నాయకులు శివారెడ్డి గౌడ్, లక్ష్మీకాంతరెడ్డి, విరుపాక్షి రెడ్డి, పేట శ్రీనివాస్ రెడ్డి, సర్పంచి తోట సావిత్రి, ఎంపిడిఒ దశరథ రామయ్య, వైసిపి నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, చాంద్ బాషా, జడ్పిటిసి నిఖిల్ చక్రవర్తి, ఇఒఆర్డి ఈశ్వరయ్య స్వామి పాల్గొన్నారు. **దేవనకొండ** పట్టణంలోని 2వ సచివాలయంలో జడ్పిటిసి రామకృష్ణ, మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున ఆధ్వర్యంలో 'సిఎం జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. జిల్లా జెసిఎస్ అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శాంతి కుమార్ హాజరయ్యారు. ముందుగా సచివాలయం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. సచివాలయ ఆవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, వైసిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం బిల్డింగ్ కాలనీలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎంపిడిఒ గౌరీదేవి, పంచాయతీ సెక్రటరీ అబ్దుల్ రహిం, వైసిపి నాయకులు ప్రభాకర్ రెడ్డి, నిజాలు రెడ్డి, నారాయణరెడ్డి, ప్రేమ్ నాథ్ రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్, పల్లెదొడ్డి చంద్ర, యూసుఫ్ బాష, కందనాతి రంగన్న, నీలి రాజశేఖర్ పాల్గొన్నారు. **మంత్రాలయం**లోని సచివాలయం-2 పరిధిలో 'ఎపి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. అందుకు ముందు రాఘవేంద్ర సర్కిల్‌లో వైసిపి జెండాను వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి ఆవిష్కరించారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి జి.వెంకటేష్, ఎంపిపి పి.రాఘవేంద్ర, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, మాజీ సర్పంచి గోర్కల్ కృష్ణస్వామి, నాయకులు శివకుమార్, బొంబాయి శివ, వీరయ్య శెట్టి, దామోదర్ గుప్తా, కోల్గేట్ రమేష్ పాల్గొన్నారు. **కోసిగి**లోని 1వ సచివాలయంలో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. మధ్యాహ్నం సచివాలయం-2లో 'సంక్షేమ పథకాల బోర్డు'ను ఆవిష్కరించారు. అనంతరం వైసిపి జెండాను మండల జెసిఎస్ ఇన్‌ఛార్జీ పి.మురళీమోహన్ రెడ్డి ఆవిష్కరించారు. సర్పంచి అయ్యమ్మ, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షులు నాడిగేని నరసింహులు, మహాంతేష్ స్వామి, ఎన్.నాగరాజు, బసిరెడ్డి, హోళగుంద కోసిగయ్య, ఉస్మాన్, బుల్లి నరసింహులు, పి.నాగేష్, ప్రవీణ్ కుమార్, సోఫీ, కాంట్రాక్టర్ నాగరాజు పాల్గొన్నారు. **హాలహర్వి** మండలంలోని బాపురం సచివాలయంలో వైసిపి మండల కన్వీనర్ భీమప్ప చౌదరి ఆధ్వర్యంలో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. మండల జెసిఎస్ కన్వీనర్ రంజిత్ కుమార్, సర్పంచి నాగేంద్ర పాల్గొన్నారు.


పెద్దకడబూరులో స్వాగతం పలుకుతున్న నాయకులు


నందవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి


మంత్రాలయంలో మాట్లాడుతున్న నాయకులు


కోసిగిలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు


దేవనకొండలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

బహిరంగ సభను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - ఆస్పరి

ఈనెల 15న విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు నాయకులను, కార్యకర్తలను కోరారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. విశాఖ రైల్వే జోన్, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి, ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, జనసేన పార్టీలు ప్రశ్నించకుండా బిజెపికి తొత్తుగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. సిపిఎం మండల నాయకులు రంగస్వామి, రామాంజినేయులు, రవి, మల్లి, మురళీ, ముని, రమేష్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

- తహశీల్దార్ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలో పని చేస్తున్న బూత్ లెవెల్ అధికారులందరూ ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని తహశీల్దార్ లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం లో బిఎల్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న సచివాలయ అధికారులతో కలిసి ప్రజలకు ఓటు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. ఫారం 6, 7, 8 ద్వారా కూడా ప్రజలకు తెలియజేయాలన్నారు. జాబితాలో ఎట్టి పరిస్థితుల్లో డెత్ ఫొటోలు, డబుల్ ఫొటోలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఏదైనా సమస్య వస్తే తమకు తెలియజేయాలని కోరారు. సీనియర్ అసిస్టెంట్ మధు స్వామి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహశీల్దార్ లక్ష్మీనారాయణ


ప్రజలకు వివరిస్తున్న శ్రీనివాస్ రెడ్డి

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు జరగాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని చిలుకలడోన గ్రామంలో క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లా రెడ్డి, మాజీ సర్పంచి హనుమంతు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేగా తిక్కారెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ సర్పంచి హనుమంతు, తిక్కయ్య, ఈరన్న, శివరాం, రంగన్న, ఆంజనేయ, ఎల్లప్ప, తోక హనుమంతు, రామకృష్ణ పాల్గొన్నారు. **పెద్దకడబూరు** మండలం మురవణి గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి తనయుడు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి ఇంటింటికీ వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. సత్యన్న గౌడ్, లారీల రంగన్న, చంటోడు, ఎంపిటిసి జాన్, సురేష్, యోహాన్, చెన్నకేశవులు, దస్తగిరి, నరసయ్య, తెలుగు యువత చెన్నకేశవ, వీరేష్ పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ఉమాదేవి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎంపిటిసిలు అరకొరగా హాజరయ్యారు. కోరం తగినంత మంది రాకపోవడంతో సభ్యుల కోసం ఎంపిపి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమావేశానికి వచ్చిన అరకొర సభ్యులు కూడా ప్రజా సమస్యలను ప్రస్తావించడంలో విఫలమయ్యారు. ప్రజా ప్రతినిధులు హాజరు కావాల్సిన స్థానంలో కుటుంబ సభ్యులు హాజరు కావడం గమనార్హం. ఒక్క తంగరడోన ఎంపిటిసి నర్సన్న తప్ప మిగతా ఎవరూ ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు ముందుకు రాలేదు. నర్సన్న మాట్లాడుతూ... ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఎకరాకు రూ.20 వేలు ఇవ్వాలని, బ్యాంకులో తీసుకున్న రుణం రూ.2 లక్షల వరకు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో సిడబ్ల్యుఎస్ స్కీం ఏర్పాటు చేసి తాగునీటి సమస్య రాకుండ పందికోన రిజ్వాయర్ నుంచి ఆస్పరి మండలానికి పైపు లైన్ ద్వారా నీటిని తీసుకొచ్చి గ్రామాలకు చేయాలని పేర్కొన్నారు. జడ్పిటిసి దొరబాబు, ఎంపిడిఒ రాణెమ్మ పాల్గొన్నారు.


ప్రజా ప్రతినిధుల స్థానంలో హాజరైన కుటుంబ సభ్యులు

మంత్రి జయరామ్ సహకారంతో గ్రామాభివృద్ధి: వైసిపి

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని వందవాగిలిలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్, నెరణికి దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైసిపి తాలూకా ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణస్వామి సహకారంతో గ్రామాభివృద్ధి చేసినట్లు వైసిపి సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్ ఎం.మెలిగిరి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుంచి మసీదు వరకు రూ.25 లక్షలతో మంత్రి జయరామ్ సహకారంతో సిసి రోడ్డు, డ్రైనేజీ వేసినట్లు తెలిపారు. సిసి రోడ్డు పనులు పూర్తి కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వైసిపి నాయకులు జయన్న, కె.లక్ష్మి కాంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైసిపి నాయకులు

దళిత సమస్యలపై వివక్ష ఇంకెన్నాళ్లు..?

- డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - గోనెగండ్ల


మాట్లాడుతున్న ఆనంద్ బాబు

దళితులపై కొనసాగుతున్న ఆధిపత్య వర్గాల వివక్షతో పాటు అధికార వివక్షను కూడా తోడుగజేసి ఇంకెంత కాలం దళితులను సమస్యల అగాధంలో ఉంచుతారని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎమ్.డి.ఆనంద్ బాబు విమర్శించారు. శుక్రవారం గోనెగండ్ల ప్రభుత్వాస్పత్రి ఆవరణలో డప్పు కళాకారుల సంఘం సమావేశం మండల కార్యదర్శి పెద్ద కర్రెన్న అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆనంద్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కరుణాకర్ హాజరయి మాట్లాడారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 73 ఏళ్లు పూర్తయినా నేటికీ దళితుల పట్ల సామాజిక, ఆర్థిక, రాజకీయ వివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. వార్షిక బడ్జెట్‌లో దళితులకూ కేటాయించాల్సిన నిధుల దగ్గర మొదలైన వివక్ష అన్నిచోట్లా కొనసాగుతోందని తెలిపారు. 2013 దాకా డప్పుకు ప్రభుత్వ గుర్తింపే లేదన్నారు. పోరాడి గుర్తింపును, పింఛన్లు సాధించినా వాటిని ఎలా తీసేయాలనే ఆలోచనలోనే ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. డప్పు కళాకారుల సంఘం మండల ఉపాధ్యక్షులు దేవదాసు, చిన్న కర్రెన్న, నరసింహుడు, ఆదాము, ఈరప్ప, చిన్న మద్దిలేటి, మాణిక్యం, పెద్దయ్య, నడిపి దస్తగిరి, శివ, మరో 20 మంది డప్పు కళాకారులు పాల్గొన్నారు.

వర్గీకరణపై హామీ ఇస్తే పతనం తప్పదు

- నవంబర్ 11 బ్లాక్ డేగా ప్రకటన
- మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు రంగయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


సమావేశంలో మాట్లాడుతున్న రంగయ్య

ఎస్సీ వర్గీకరణకు హామీఇస్తే బిజెపి పతనం తప్పదని, మందకృష్ణ మాదిగ తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభకు ప్రధాని రావడం సిగ్గుచేటని మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు రంగయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాల మహానాడు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోడీ ఒక వర్గానికి కొమ్ము కాస్తూ ఎన్నికల డ్రామా ఆడటానికి వస్తున్నారని విమర్శించారు. మరి మాలల ఓట్లు అవసరం లేదా అని ప్రశ్నించారు. రాజ్యాంగ విరుద్ధమైన అంశంపై హామీ ఎలా ఇస్తారో చూస్తామని హెచ్చరించారు. ఉషామేహ్రెన్ కమిషన్ నివేదికను జాతీయ ఎస్సీ కమిషన్ చెత్త బుట్టలో వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ పరిధిని దాటిన అంశమని, వర్గీకరణ అనేది రాజ్యాంగంలో ఆర్టికల్ 14, 15, 16 ఉల్లంఘన అని ఏనాడో సుప్రీం కోర్టు తెలిపిందని అన్నారు. రాజకీయ లబ్ధి కోసం వివిధ పార్టీలు నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. బిజెపి మాదిగలకు ఎన్ని పదవులు ఇచ్చిందో చూపాలని తెలిపారు. బిజెపికి మాదిగల మీద ఎనలేని ప్రేమ పుట్టుకొస్తోందని, అది మాదిగలు గమనించాలని కోరారు. నవంబర్ 11న బ్లాక్ డేగా ప్రకటిస్తూ, వర్గీకరణపై ప్రధాని ప్రకటన అనంతరం బిజెపి కార్యాలయాలను ముట్టడించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షులు రాజోలప్ప, జిల్లా అధ్యక్షులు మల్లేష్, వైస్ ప్రెసిడెంట్ పరమేష్, యువదళం యువ నాయకులు బలరాం, రాము, రఘు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ గుర్తించేందుకే 'చెకుముకి'

- జెవివి జిల్లా ఉపాధ్యక్షులు శంకరయ్య

ప్రజాశక్తి - కోసిగి

పాఠశాల స్థాయిలో విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా ఉపాధ్యక్షులు శంకరయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని కోసిగి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, దుద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జంపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో, మౌంట్ కార్మెల్ ప్రయివేట్ పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోసిగి ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ మాట్లాడారు. జెవివి చెకుముకి పోటీలు నిర్వహించడం కోసిగి ప్రాంతానికి శుభ పరిణామమని తెలిపారు. వెనుకబడిన కోసిగి ప్రాంత విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని, కుతూహలాన్ని కలిగిస్తోందని చెప్పారు. మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు సమాజం నుంచి తొలగిపోయి ప్రతి ఒక్కరి జీవితాల్లో శాస్త్రీయ భావజాలం ప్రతిఫలించినప్పుడే శాస్త్రీయ సమాజం ఆవిర్భవిస్తుందని తెలిపారు. అనంతరం జెవివి జిల్లా ఉపాధ్యక్షులు శంకరయ్య మాట్లాడారు. జెవివి ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి ఫిబ్రవరి 28 వరకు ప్రజల్లో సైన్స్ గురించి అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అంతయ్య, గురుస్వామి, వెంకటరెడ్డి, రవికుమార్, సుభాన్ సింగ్, రహీం, మేఘనాథ్, మహేష్, చంద్రశేఖర్, సులేమాన్ పాల్గొన్నారు. **కౌతాళం** మండలం ఎరిగేరి ఉన్నత పాఠశాలలో జెవివి, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు రమేష్ పర్యవేక్షణలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఉపాధ్యాయులు మాధురి, రాము, రేణుకమ్మ, వెంకటేశులు, అబ్దుల్ రహీం, బీరప్ప, రంగారెడ్డి, చిట్టి రాజు, లింగన్న, లీలావతి, రాజ్యలక్ష్మి, సుధారాణి, జయరాణి పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయం, ఎపి మోడల్ స్కూల్‌లో సుమారు 500 మంది విద్యార్థులకు చెకుముకి సైన్సు పరీక్షలు నిర్వహించారు. జెవివి సైన్స్ కోఆర్డినేటర్ కె.విజయ్ కుమార్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు గుమ్మల బాబు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ఎపి మోడల్ స్కూల్ ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ పద్మావతి, కస్తూర్బా గాంధీ విద్యాలయం ఇన్‌ఛార్జీ స్పెషల్ ఆఫీసర్ రాధా రాణి, ఉపాధ్యాయులు అక్బర్, అమానుల్లా బేగ్, మహబూబ్ బాష, తాజుద్దీన్, రామచంద్రరావు, భాస్కర్, మురళీకృష్ణ, ఉస్మాన్, రంగస్వామి, ఖాదర్ భాష, రవికుమార్, నాగజ్యోతి, మల్లేశ్వరమ్మ, ప్రమీల బాయి పాల్గొన్నారు.


కోసిగిలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి
శనివారం 11 నవంబర్ 2023 5 నంద్యాల





స్పందనలో మాట్లాడుతున్న కలెక్టర్

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- 'జగనన్నకు చెబుదాం'లో అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి - మిడుతూరు

జిల్లా కలెక్టర్ వచ్చి కొళాయి కనెక్షన్లు సరిచేయ్యాలా అంటూ సంబం ధిత శాఖ అధికారులపై నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శు క్రవారం మండల కేంద్రమైన మిడుతూరులోని స్థానిక వెలుగు కార్యాలయం ముందు జగనన్నకు చెబుదాం అనే స్పందన కార్యక్రమం నిర్వహిం చారు. అందులో భాగంగానే మండల పరిధిలోని వివిధ గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజల నుండి వినతులను కలెక్టర్ స్వీకరించారు. ముందుగా జిల్లా కలెక్టర్‌ను మిడుతూరు జడ్పీటీసీ పర్వత యుగంధర్ రెడ్డి , ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, పీరు సాహెబ్ పేట సింగిల్ విండో చైర్మన్ టి .నాగ తులసి రెడ్డి, నాగాలూటి సర్పంచ్ ఉషారాణి, ఎంపీడీవో, తహ శీల్దార్ పూల బొకేతో పాటు దుశ్యాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొళాయి కనెక్షన్లు కలెక్టరే చూడాలా సంబంధిత శాఖ అధికారులు ఏం చేస్తున్నట్లు స్పందనలో వచ్చిన ఫిర్యాదు లను సకాలంలో పరిష్కరిస్తే మా వరకు ఎందుకొస్తాయని, గ్రామాలలో శానిటేషన్ ఎక్కడ వేసిన చెత్త అక్కడే రోడ్ల పైన కనబడుతోందని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. రైతుల భూ సమస్యలు పరిష్కరించడంలో వీఆర్వోలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్డీవో ఎప్పటికప్పుడు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని ఆయన ఆదేశిం చారు. స్పందనలో ప్రజల నుండి 117 ఫిర్యాదులు అందినట్లు డిఆర్వో తెలిపారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ప్రశ్నించగా మండల స్థాయి అధికారులు సమాధానం చెప్పలేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నందికొట్కూరు రూరల్ సిఐ విజయ భాస్కర్, మిడుతూరు, బ్రాహ్మణ కొట్టుకూరు, ఎస్సైలు జగన్ మోహన్, ఓబులేష్‌ల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పుల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, ఆత్మకూరు ఆర్డీవో మిరియాల దాస్, నందికొట్కూరు సిడిపిఓ కోటేశ్వరి, తహశీల్దార్ ప్రకాష్ బాబు, ఎంపీడీవో జి .నాగ శేషాచల రెడ్డి, ఈవోఆర్డీ ఫక్రుద్దీన్, వ్యవసాయ అధికారి ఎం.పీరు నాయక్, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాలో శాంతి నెలకొల్పాలి

- ఇజ్రాయెల్ దాడులు ఆపాలని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిరసన



ఆత్మకూర్ : కర్నూల్ - గుంటూరు రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న రమేష్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల

పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపి శాంతిని నెలకొల్పాలని సిపిఎం, సిపిఐ నాయకులు కోరారు. నంద్యాల పట్టణంలో గాంధీ చౌక్ నందు శుక్రవారం సిపిఎం - సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో పాలస్తినపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి టి రమేష్ కుమార్ మాట్లాడుతూ పాలాస్తినపై అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఐక్యరాజ్యసమితి నిర్ణయాలకు అనుగుణంగా పాలాస్తిన భూభాగాల నుంచి ఇజ్రాయెల్ పూర్తిగా పక్కకు తప్పుకోవాలని, భారత ప్రభుత్వం తటస్థ వైఖరిని విడనాడి పాలాస్తినా ప్రజలకు మద్దతు ప్రకటించి సహాయ సహకారాలు అందించాలని నినాదించారు. అమెరికా సామ్రాజ్యవాద దేశం అండదండలతో ఇజ్రాయిల్ దేశం పాలస్తీనా దేశ భూభాగాన్ని 90 శాతం దాకా ఆక్రమించుకొని అక్కడున్న చమురు ఆయిల్ నిల్వలను స్వాధీనం చేసుకునేందుకు 10 వేల మందిని యుద్ధం ద్వారా హత్య చేయబడ్డారని, అందులో 4500 మంది పసిపిల్లలు చనిపోయారని తెలిపారు. యుద్ధం ఆపాలని ఐక్యరాజ్యసమితి తోపాటు అనేక దేశాలు చెప్పినప్పటికీ అమెరికా సామ్రాజ్యవాదం ప్రయోజనాల కోసం ఇజ్రాయిల్ యుద్ధాన్ని కొనసాగిస్తూ ఉందన్నారు. భారతదేశం ఇప్పటివరకు పాలస్తీనా దేశానికి మిత్ర దేశంగా ఉందని నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదానికి భయపడి యుద్ధాన్ని ప్రోత్సహించ పద్ధతిలో మౌనంగా ఉండడం విచారకరమన్నారు. సమదూరం పాటిస్తా మని చెప్పడం విచారకరమన్నారు. పాలస్తీలో శాంతి నెలకొల్పేందుకు ఐక్యరాజ్య సమితి కృషి చేయాలని వారు కోరారు. తక్షణమే పాలస్తీలపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని వారు నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ పట్టణ నాయకులు సోమన్న, దొమ్మరి శ్రీనివాసులు, సిపిఎం సీనియర్ నాయకులు తోట మద్దులు మాట్లాడారు. సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కే ఎం డి గౌస్, డి లక్ష్మణ్ వెంకటలిం గం తదితరులు ప్రసంగించారు. సిపిఐ నాయకులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపి శాంతిని నెలకొల్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నాడు పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పి పకీర్ సాబ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎం నాగేశ్వరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు కే భాస్కర్ రెడ్డి, బేస్తరాజు, బాలయ్య, రంగమ్మ, ఆర్ జయ రాణి, హుస్సేనమ్మ ,ప్రసాద్, ఏసేపు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్‌ల ఆధ్వర్యంలో అమెరికా సామ్రాజ్యవాద చర్యలను నిరసిస్తూ పాలస్తీనాలో శాంతిని నెలకొల్పాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మా బాష, పి సుధాకర్, రామ్ నాయక్, వీరన్న, తుమ్మలూరు శివకుమార్ ఏ కిరణ్ గణపతి, సామేలు, మల్లయ్య, నబి, నూర్ అహమ్మద్,తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న సిపిఎం పార్టీ ప్రజాసంఘాల నాయకులు

జిల్లా వ్యాప్తంగా చెకిముకి

సైన్స్ టాలెంట్ టెస్ట్ విజయవంతం

ప్రజాశక్తి-నంద్యాల: నంద్యాల జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాలలోని పాటశాలల్లో 12,000 మంది విద్యార్థులు పాఠశాల స్థాయి చెకిముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యారు. సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వ హించడం వల్ల విద్యార్థులలో శాస్త్రీయ అవగాహన, శాస్త్రీయ దృక్పథం అలవడుతుందని జనవిజ్ఞాన నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మాణిక్యం శెట్టి తెలిపారు. మండల స్థాయి పరీక్షలు నవంబర్ 30 న ఆయా మండలాలలో నిర్ణయించిన చోట్ల నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి పాఠశాలలో ప్రథమ స్థానంలో వచ్చిన విద్యార్థులు మండలస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలలో సహకరించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు జిల్లా జెవివి అధ్యక్షులు, ప్రధానకార్యదర్శి డాక్టర్ నాగరాజు, బి.మాణిక్యంశెట్టి కతజ్ఞతలు తెలిపారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన పరీక్షలలో జెవివి నాయకులు రామరాజు, గోపాల్, పునీత్, లతీఫ్, సర్వజ్ఞమూర్తి, రామ మూర్తి, సుబ్బారెడ్డి పరిశీలకులుగా వ్యవహ రించారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాలలో 3000 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఒక ప్రకటనలో తెలిపారు.

డోన్ : సైన్స్‌తోనే సామాజిక పురోగతి సాధ్యం అని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాతపేట ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకట సుబ్బారెడ్డి విద్యార్థులకు వివరించారు. శుక్రవారం డోన్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాతపేట నందు ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 8,9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఎం.వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ మూఢ నమ్మకాలను నమ్మరాదని, ప్రతి ఒక్కరూ గుర్తించి, సైన్స్ అంటే జీవిత భాగస్వామిగా అవగాహన కలిగి ఉండాలని కోరారు. సైద్ధాంతిక, భౌతిక, విజ్ఞాన శాస్త్ర అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందుకెళితే మానవ జీవితం సుఖమయం అవుతుందన్నారు. విద్యార్థులు పొగాకు ఉత్పత్తులను వాడటం నేరమని, వాటి వాడకం వల్ల ఆరోగ్యం పాడవుతుందని తెలిపారు. సీనియర్ ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకట రమణ, వెంకటలక్ష్మి, రఘునాథ్, ఎస్తేరమ్మ, రవిశేఖర్, సుబ్బారాయుడు, శ్రీనివాసులు, లక్ష్మయ్య, అనంత శ్రీనివాసులు, లక్ష్మికాంతరెడ్డి,రాధ,అల్లిపీరా, భూకాంతరెడ్డి, మద్దిలేటి, విజయకుమార్, సుబాన్, జయసుబ్బారాయుడు, తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులతో పరీక్ష రాయిస్తున్న బి.మాణిక్యంశెట్టి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎం.వెంకట సుబ్బారెడ్డి

ప్రగతిని వివరించేందుకే 'పల్లెకు పోదాం'

వై ఎపికి సిఎం జగన్‌లో ఎమ్మెల్యే



సంక్షేమ పథకాల అభివృద్ధి కార్యక్రమాల పట్టికను డిస్ప్లే చేసిన ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల కలెక్టరేట్ : రాష్ట్రంలో జరిగిన ప్రగతిని ప్రజలకు తెలియజేసేందుకే పల్లెకు పోదాం-వార్డుకు పోదాం- ఎపికి జగనే ఎందుకు కావాలి సిఎం అనే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి పేర్కొన్నారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని రైతునగరం-1 నందు వార్డుకు పోదాం కార్యక్రమాన్ని స్థానిక కౌన్సిలర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నంద్యాల నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు దేశం సుధాకర్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. వైఎస్ఆర్సిపి రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ పి పి మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, కౌన్సిలర్ చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు రామ సుబ్బారెడ్డి, దేశం సుధాకర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. **బనగానపల్లె:** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని నాలుగవ సచివాలయ ఆవరణంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలిలో కాటసాని ఓబుల్ రెడ్డి పాల్గొని పట్టణంలోని నాలుగవ గ్రామ సచివాలయ పరిధిలో ప్రజలకు లబ్ధి పొందిన సంక్షేమ పథకాల వివరాల బోర్డును, వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాటసాని ఓబుల్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, ఎంపీడీవో శివరామయ్య, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, జడ్పిటిసి సభ్యురాలు సుబ్బ లక్ష్మమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, గ్రామపంచాయతీ ఈవో ఖలీల్, , భానుముక్కల సహకార పరపతి సంఘం అధ్యక్షుడు నీలి శ్రీనివాసులు, వైసిపి మండలం కన్వీనర్ సన్నల జనార్దన్ రెడ్డి, నాయకులు అబ్దుల్ ఫైజ్, అత్తార్ జాహీద్ హుస్సేన్, కో ఆప్షన్ నెంబర్ అనిల్, వార్డ్ మెంబర్ సురేష్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అర్హులైన ప్రజల వద్దకే పథకాలు అందించిన ఏకైక ప్రభుత్వం అని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. కొలిమిగుండ్ల సచివాలయం2 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు సీఎం జగన్ ఎందుకు కావాలని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జెండాను జిల్లా పరిషత్ చైర్మన్, వైసీపీ మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి, జిల్లా ప్రచార అధ్యక్షులు పేరం సత్యనారాయణరెడ్డి, సచివాలయాల కన్వీనర్ మొలక రాజారెడ్డి, లాయర్ మహేశ్వర్ రెడ్డి, పేరం సూర్యనారాయణరెడ్డి, పేరం నందకిషోర్ రెడ్డి, పేరం ఆదినారాయణ రెడ్డిలు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సర్పంచ్ శివ రాముడు, మిగతా 6వ పేజీలో...



మన్యం డేవిడ్ మృతికి సిఐటియు సంతాపం

ప్రజాశక్తి-డోన్

డోన్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం లో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధం విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి మన్యం డేవిడ్ మృతికి సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం, మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.రామాంజనేయులు, ఎవి. భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.కుల్లాయప్ప, ఉపాధ్యక్షులు కె.పెద్దఎల్లయ్య సంతాపం వ్యక్తం చేశారు. డేవిడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. నాయకులు మాట్లాడుతూ అనారోగ్యంతో గురువారం మతి చెందిన డేవిడ్ అకాల మరణం బాధాకరమని, ఆయన మున్సిపల్ కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించిన నాయకుడని, ఆయన త్యాగనిరతిని,పోరాట పటిమను కొనియాడారు.భౌతికంగా ఆయన దూరం కావడం వారి కుటుంబానికే కాక కార్మిక వర్గానికి కూడా తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏసు,ఆవులయ్య, దేవదానం, రామాంజి, వెంకటలక్ష్మమ్మ, అంజనమ్మ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

బ్రాహ్మణ కొట్టుకూరు గ్రామానికి చెందిన పింజరి హుస్సేన్ లారీ డ్రైవర్ గా పని చేస్తూ కర్ణాటక రాష్ట్రంలో వచ్చిన వరద నీటిలో కొట్టుకొని పోయి మరణించారు. విషయం తెలుసుకున్న నందికొట్కూరు శాసన సభ్యులు తోగూరు ఆర్థర్ చొరవ తీసుకొని ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా మాట్లాడి రూ. 2 లక్షల ఆర్థిక సహాయం చెక్కును శుక్రవారం నాడు ఎమ్మెల్యే వారి క్యాంపు కార్యాలయంలో మృతుని భార్య ఖాసిం బి, మృతుని తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసిపి యువ నాయకులు ఉదయ్ కిరణ్ రెడ్డి, రఘు రెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారునికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - ప్యాపిలి

చైనాలో గత నెల 26 నుంచి 28 వరకు జరిగిన పారా రోయింగ్‌లో పోటీల్లో భారత్ తరఫున సిల్వర్ మెడల్ సాధించి శుక్రవారం ప్యాపిలికి వచ్చిన వెంకటనారాయణకు ప్యాపిలి మండల ప్రజలు, మిత్రులు ఘన స్వాగతం పలికారు. బైపాస్ రోడ్డు నుంచి వాహనంలో బైక్ ర్యాలీతో బస్టాండ్ మీదుగా ర్యాలీ నిర్వహించి తన ఇంటి వరకుసాగనంపారు. మార్గమధ్యలో సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు వెంకట్ నారాయణకు పూలమాలవేసి సత్కరించారు. ఈ సందర్భంగా వెంకట్ నారాయణ మాట్లాడుతూ కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే సమర్ధవంతమైన కోచ్ అందించిన శిక్షణతోనే తాను అంతర్జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించగలిగానని తెలిపారు. రాబోయే కాలంలో మరెన్నో పతకాలు సాధిస్తానని తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చల్లా అనుదీప్, కోదండరామయ్య, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



వాహనంలో ఊరేగింపుగా వెళుతున్న క్రీడాకారుడు వెంకటనారాయణ

వెంకటనారాయణకు నాగేశ్వరరావు యాదవ్ ఘన సన్మానం



వెంకటనారాయణ ను సన్మానిస్తున్న నాగేశ్వరరావు యాదవ్

ప్యాపిలి పట్టణ వాసి వెంకట నారాయణ చైనాలో జరిగిన ఏషియన్ గేమ్స్ రోయింగ్ క్రీడా విభాగంలో రజత పతకం సాధించడం దేశానికి గర్వకారణంగా ఉందని లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ నాయకులతో కలిసి సన్మానించారు. ఈ కార్య క్రమంలో స్థానిక లయన్స్ క్లబ్ నాయకులు రామ్మోహన్ యాదవ్,గండికోట రామాంజనేయులు,చిన్న సుంకయ్య, నాగేంద్ర, మల్లికార్జున, మధుసూదన్, కోదండరామయ్య,అనుదీప్, శివకుమార్,కుళ్లాయప్ప,శివ కుమార్,అక్బర్ లయన్స్ క్లబ్ నాయకులు పాల్గొన్నారు.



వెంకటనారాయణ ను సత్కరిస్తున్న టిడిపి డోన్ ఇంచార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి

వెంకట నారాయణ విజయం దేశానికే గర్వకారణం

భారతదేశం గర్వించేలా కొంగనపల్లి వెంకటనారాయణ విజయం సాధించారని డోన్ నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఇటీవల చైనాలో జరిగిన ఆసియా రోయింగ్ పోటీల్లో క్రీడాకా రుడు వెంకటనారాయణ సిల్వర్ మెడల్ సాధించారు. శుక్రవారం తన స్వగ్రామం ప్యాపిలికి వచ్చిన సందర్భంగా సుబ్బారెడ్డి క్రీడాకారుడు వెంకట నారాయణ ఇంటికివెళ్లి సత్కరించారు. వారు మాట్లాడుతూ ప్రపంచ క్రీడా పటంలో భారత పేరు నిలబెట్టిన వెంకటనారాయణ డోన్ నియోజకవర్గ తెలుగు బిడ్డ కావడం గర్వకారణమన్నారు. ఇలాంటి విజయాలను రాబోయే క్రీడలలో ఎన్నో మెడల్స్ సాధించాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్య క్రమంలో రాఘవేంద్ర, అంకిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి,రామసుబ్బయ్య,చిన్న సుంకయ్య, సుదర్శన్, చల్లా వీరా,నాగేంద్ర,ప్రిన్సిపాల్ మధు,కొంగనపల్లి మధు,మల్లికార్జున,కోదండ రామయ్య, అనుదీప్,రామాంజనేయులు, దనం మధు, బ్యాంకు శీను, తదితరులు పాల్గొన్నారు.



వైసిపి జెండాను ఎగురవేస్తున్న నాయకులు

పేదవాడి అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- మండల వైసీపీ అధ్యక్షులు జి రామలింగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - పాములపాడు

ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి జగన్ ఉద్దేశమని మండల వైసీపీ అధ్యక్షులు జి రామలింగేశ్వర రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ల ఇంచార్జి టిఎన్ఆర్ నాగరాజులు అన్నారు. శుక్రవారం మండలంలోని బానుముక్కల గ్రామంలో పల్లెకు వెళ్దాం కార్యక్రమం, ఏపీకి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమాల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని గ్రామానికి జరిగిన అభివృద్ధి వచ్చిన సంక్షేమాల పథకాల డిస్ప్లే బోర్డును ఆవిష్కరించి గ్రామంలో వైసీపీ జెండాను ఎగర వేశారు. అనంతరం వారు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక గ్రామాలలో ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. మండలాల చుట్టూ తిరగకుండా గ్రామాల్లోని సచివాలయం ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కార దిశగా జగనన్న పాలన కొనసాగుతుందన్నారు. విద్య, వైద్యానికి పెద్దపీట వేశారన్నారు. ప్రతి విద్యార్థి ఇంగ్లీష్ మీడియం చదవాలన్నదే ముఖ్యమంత్రి కోరిక అన్నారు. ప్రతి పేదవానికి కార్పొరేట్ వైద్యం మందడమే సిఎం లక్ష్యం అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి వారి అకౌంట్లో నాగదును జమ చేస్తున్నారన్నారు. పేద ప్రజల అభివృద్ధి లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తుందని మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి శ్రీనివాసులు నాయుడు, మద్దూరు సింగిల్‌విండో సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, చెలిమిల్ల సర్పంచ్ చంద్రారెడ్డి, ఎంపిటీసీ సురేష్, మిట్ట కందల సర్పంచ్ చింతల నారాయణ, తుమ్మలూరు సర్పంచ్ వరప్రసాద్, సొసైటీ డైరెక్టర్ గోపాలు, సొసైటీ మాజీ చైర్మన్ ఎల్వి రమణారెడ్డి, నాయకులు వెంకటేశ్వర రెడ్డి, జబ్బారు, మధుసూదన్ రావు, ప్రభాకర్, బాలు నాయక్, పుల్లయ్య, బాలకచెర్ల ఉపసర్పంచ్ నరసింహులు, దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో జనసేన జెండాను ఎగురవేస్తాం

- ఇరిగెల సోదరులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆళ్లగడ్డలో జనసేన జెండాను ఎగర వేస్తామని నియోజకవర్గ జనసేన నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి అన్నారు. ఇరిగెల సోదరులు జనసేన పార్టీలో చేరి శుక్రవారం ఆళ్లగడ్డకు రావడంతో సిరివెళ్ల మెట్ట వద్ద ఇరిగెల రాంపుల్లారెడ్డితో పాటు సోదరులకు కార్యకర్తలు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. అనంతరం సిరివెళ్ల నుంచి ఆళ్లగడ్డ వరకు మోటార్ సైకిళ్లతో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన ఇన్చార్జి చింతల సురేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ అందరము కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గంలో జనసేనను అభివృద్ధి చేసుకుందామని ప్రతి గ్రామంలో జనసేన జెండాను ఎగురవేద్దామని ఆయన పిలుపుని చ్చారు. 24 గంటలు అందుబాటులో ఉంటానని జనసైనికులు తనను ఎప్పుడైనా కలవవచ్చు అన్నారు. తాలూకాలో ముఖ్యంగా తెలుగు గంగ, కేసీ కెనాల్ కింద పంట కాలువలు లేకపోవడంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడం లేదని ఇరిగెల అన్నారు. ఇటీవల బస్సు యాత్ర పేరిట ఉపముఖ్యమంత్రులు ఆళ్లగడ్డకు వచ్చిన కేసీ కాల్వ రైతులకు నీటిని సక్రమంగా అందించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వలేదన్నారు. పొలాలకు నీళ్లు లేక రైతులు కన్నీళ్లు పెడుతుంటే వీరు కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఆళ్లగడ్డ మార్కెట్ యార్డుకు దళితుడిని చైర్మన్ చేసినప్పటికీ ఆయనకు పూర్తి పగ్గాలు ఇవ్వకుండా వైస్ చైర్మన్ అన్ని తానై నడిపించాడని ఇరిగెల విమర్శించారు. ఎమ్మెల్యే చేస్తున్న అక్రమాలను చూసే తాను వైకాపాను వీడానన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ సమస్యలపై తాము చేయబోయే పోరాటానికి పవన్ కళ్యాణ్ మద్దతుగా ఉంటారని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన అధికార ప్రతినిధి ఇరిగేల సూర్య నారాయణ రెడ్డి, ఇరిగెల రామచంద్రారెడ్డి, ఇరిగెల విశ్వనాథరెడ్డి, ఇరిగెల ప్రతాప్ రెడ్డి, జనసేన తాలూకా ఇంచార్జ్ మైలేరి మల్లయ్య, జున్ను ప్రసాద్ రెడ్డి, పెసర వాయి చాంద్ బాషా, దాదిరెడ్డి మధుసూదన్, మౌలాలి, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇరిగెల్ల రాంపుల్లారెడ్డి


అకాల వర్షానికి నేల వాలిన వరి పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

వరి రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలో అకాల వర్షం కురిసి ఈదురుగాలులతో చేతికొచ్చిన వరి పంట దెబ్బతిన్న రైతులను, కౌలు రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి రత్నమయ్య, సిపిఎం నాయకులు డేవిడ్ రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు వారు పడిపోయిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన రైతుల వివరాలను నష్టపరిహారం కోసము ప్రభుత్వానికి నివేదికలు పంపాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.



జెఎన్‌టియు సౌత్ జోన్ జట్టుకు ఆర్జీఎం విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - పాణ్యం

వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ జేఎన్టీయూ సౌత్ జోన్ పోటీలకు ఆర్ జిఎం విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన కళాశాలలో మాట్లాడుతూ ఈనెల తొమ్మిదవ తేదీన కడప కేఎస్ఆర్ కళాశాలలో నిర్వహించిన వాలీబాల్ బాల్ బ్యాడ్మింటన్ సౌత్ జోన్ జట్టు ఎంపిక పోటీలలో వాలీబాల్ మహిళా జట్టుకు కళాశాలకు చెందిన డి మానస, పురుషుల విభాగంలో పవన్ కుమార్ ఎంపికైనట్లు తెలిపారు. బాల్ బ్యాడ్మింటన్ జుట్టుకు వి అశోక్ కుమార్ ఎంపికైనట్లు తెలిపారు. కేరళలో జరిగే వాలీబాల్ పోటీలలో, బెంగళూరు యూనివర్సిటీలో జరిగే బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో విద్యా ర్థులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల ఎండి శివరాం, డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ అభినందించారు. కళాశాల స్పోర్ట్స్ డైరెక్టర్ వెంకటేష్, పిడి వెంకటేశ్వర నాయక్ పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య వైన్ షాప్ ఏర్పాటు పర్మిషన్ రద్దు చేయాలి

- డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల

స్థానిక నూనెపల్లి దగ్గర ఉన్న భగత్ సింగ్ కాలనీ దగ్గర ఇళ్ల దగ్గర వైన్ షాపులు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొదని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు అధికారులను కోరారు. శుక్రవారం డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ, ఎస్ఎఫ్ఐ పట్టణ సహాయ కార్య దర్శి మధుకిరణ్ మాట్లాడుతూ ఇళ్ల మధ్య నుండి షాప్ యజమాని మార్చి వేరే చోట పెట్టుకునేలా పరిమిషన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ నాయకులు గోపాల్, మహేష్, సంజయ్, మధు, నవీన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు పాములపాడులో కరెంటు కోత

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలంలోని రెండు సబ్ స్టేషన్లల నుండి గ్రామాలకు ఇచ్చే కరెంటు నేడు ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పవర్ సప్లై ఉండదని ఎలక్ట్రికల్ ఏఈ అబ్దుల్ ఆబీజ్ శుక్రవారం తెలిపారు. రెండో శనివారం ట్రాన్సారాల మెయింటినెన్స్ ఉన్నందున విద్యుత్తును నిలిపివేయడం జరుగుతుందని ప్రజలు ఈ సమయాన్ని గమనించాలని కోరారు.



మాట్లాడుతున్న నాబార్డు డి డి ఎం సుబ్బారెడ్డి

బెట్టను తట్టుకునే పంటలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

బెట్టను తట్టుకునే పంటలను రైతులు సాగు చేయాలని నాబార్డు డిడిఎం ఎం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని యాగంటి పల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో నాబార్డ్, కృషి విజ్ఞాన కేంద్రంల ఆధ్వర్యంలో "వాతావరణ అనుకూల వ్యవసాయ విధానాలపై" వర్షాధార వ్యవసాయంలో వాతావరణాన్ని తట్టుకునే సాంకేతికతలపై కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ జి ధనలక్ష్మి, అధ్యక్షతన జిల్లా స్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు సరైన సమయానికి కురువక పోవడం, తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు పంట దిగుబడులపై అత్యధిక ప్రభావాన్ని చూపిస్తున్నాయని తెలిపారు. వీటిని అధిగమించే ందుకు రైతులు వాతావరణ అనుకూల వ్యవసాయ విధానాలను తెలుసుకొని వాటిని పాటించి కరువు పరిస్థితుల నుండి తప్పించుకోవాలని సూచించారు. అనంతపురం రేకులకుంట వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ బి. సహదేవరెడ్డి మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల కలిగే సమస్యలు, వాటిని అధిగమించడానికి తీసుకోవలసిన చర్యపై వివరించారు. నీటి కుంటల యాజమాన్యం పై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ ప్రదర్శన ద్వారా కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలను శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేం ద్రం శాస్త్రవేత్తలు సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ, కర్నూ లు, ఉత్పత్తిదారుల సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మహానందిలో నూతన నవ గోశాల ప్రారంభం

ప్రజాశక్తి - మహానంది

ప్రముఖ శైవక్షేత్రం మహానంది పుణ్యక్షేత్రంలో శుక్రవారం నాడు గోవుల కోసం నూతనంగా నవ గోశాలను ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, దాతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ దాతలు పొన్నాపురం వాస్తవ్యులు తిరుమల గౌడ్ కళావతమ్మ దంపతుల సహకారంతో సుమారు 5 లక్షల 50 వేల రూపాయలు వెచ్చించి నూతన గోశాలను నిర్మించామని ఆలయానికి వచ్చే భక్తుల దర్శనార్థమై గోవుల తో నవగోకులం ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు నేటి నుండి అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఆలయ వేద పండితులు ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై

15న ప్రజా రక్షణ భేరి

- బహిరంగ సభను విజయవంతం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - పాములపాడు

సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రలు రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుండి బస్సు యాత్ర బయలుదేరి విజయవాడలో ఈ నెల 15న బిజెపి అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గొప్ప బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని, ఈ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి యేసురత్నం కోరారు. శుక్రవారం పాములపాడు సిపిఎం కార్యాలయం నందు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యేసు రత్నం, మండల కార్యదర్శి సామన్న, నాయకులు వెంకటేశ్వరరావు మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రభుత్వ పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా తెగ నమ్ముతూ దేశ ప్రజలకు తీరని ద్రోహం చేస్తోందన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నల్లధనాన్ని బయటకు తీస్తామని, అవినీతిని అంతం చేస్తామని ధరలను అదుపులో చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలు నడ్డి విరిగేలాగా ధరలు పెంచుతూ నిరుద్యోగ భారతదేశాన్ని తయారు చేస్తూ అక్రమార్కులకు అవినీతి పరులకు కేరాఫ్అడ్రస్‌గా బిజెపి మారిందన్నారు. బిజెపి ప్రభుత్వా విధానాలను విమర్శిస్తే తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందు లకు చేస్తుందన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక వాగ్దానం ఇచ్చి మాట తప్పిన ప్రభుత్వంగా బిజెపి నిలిచిపోయిందన్నారు. కోట్ల మంది అసంఘటితంగా కార్మికులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం బిజెపి విధానాలను సమర్థిస్తూ ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురావడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ నెలకొల్పకుండా విఫలమైందన్నారు. రాష్ట్రంలో 400 కరువు మండలాలు ఉండగా కేవలం 103 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించి రాష్ట్ర ప్రజలకు రైతులకు తీవ్ర ద్రోహం చేసిందన్నారు. ప్రజల పైన భారాలు వేస్తూ చెత్త పన్ను ఇంటి పన్ను విద్యుత్తు చార్జీలు పెంచుతూ వైసిపి ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరిచిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ప్రత్యామ్నాయ మార్గాలను చూపిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జాతాలు నిర్వహించి నవంబర్ 15 తేదీన లక్షలాది మందితో విజయవాడలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ప్రజలు, మేధావులు, కార్మికులు, రైతులు, శ్రామికులు అందరూ బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. **నంద్యాల**



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

కలెక్టరేట్ : ఈనెల 15వ తేదీన చలో విజయవాడ విజయవంతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి చెన్నయ్య, మండల నాయకులు మార్క్, కరిముల్లా, వీరభద్ర మోషలు కోరారు. శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో గోస్పాడు మండల కేంద్రంలో ప్రజా రక్షణ భేరి గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.


గోడ పత్రిక ను విడుదల చేస్తున్న నాయకులు

పట్టాలిచ్చిన దళితులకు భూములు చూపాలి

ప్రజాశక్తి - మిడుతూరు

పట్టాలిచిన భూములకు వెంటనే భూములను చూపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు శుక్రవారం జిల్లా కలెక్టర్‌ని కోరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో స్పందన కార్యక్రమానికి వచ్చిన జిల్లా కలెక్టర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు, మండల కార్యదర్శి ఓబులేసు, కెవిపిఎస్ నాయకులు లింగస్వామి బాధితులతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో పట్టాలు ఇచ్చిన దళితులకు భూములు చూపాలని ర్యాలీగా రాగా పోలీసులు గేటు దగ్గర అడ్డుకొని ఐదు మంది మాత్రమే రావాలని చెప్పడంతో మిగతా వారు అక్కడే ధర్నాకు పూనుకోవడం జరిగింది. అనంతరం ఐదు మంది బృం దంగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ 1996లో మిడుతూరు మండల కేంద్రంలో ఉన్న 40 కుటుంబాలు దళితులు ఆరు బీసీ కుటుంబాలకు అలగనూరు పొలిమేరలో పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చారని వాటిపై బ్యాంకు రుణాలు విత్తనాలు తెచ్చుకోవడం జరిగిందని నాటినుండి భూములు చూపించాలని వచ్చిన ప్రతి తాసిల్దార్‌ను ప్రాధేయపడిన భూములు ఇంతవరకు చూప లేదని తెలియజేశారు. అందుకు కలెక్టర్ తాసిల్దార్‌ను కోరగా పట్టా పాస్ పుస్తకాలు రెవెన్యూ రికార్డులు లేవని సమాధానం చెప్పగా అందుకు ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ పట్టా పాస్ పుస్తకాలు మండల తాసిల్దారు సంతకం, సీలు వేసి ఇచ్చారని నకిలీ పట్టా పాస్ పుస్తకం అయితే ఇచ్చిన వారిపై కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మిడుతూరు మండలంలో ప్రభుత్వ భూములను రాజకీయ అండదండతో అధికారులను మత్తుల్లో పెట్టి భూములు కబ్జా చేస్తున్నారని వారి దృష్టికి తీసుకుపోయారు. జలకనూరు బాట నుండి జలకనూరు వరకు ఉన్న 500 ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేశారని వాటిపై విచారణ చేసి చర్యలు చేపట్టాలని ప్రభుత్వ భూములు స్థానికేతరులకు బట్టలిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసు కొచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వీటిపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు లింగస్వామి, సుజ్ఞానం, ఏసన్న, జయరాముడు, తిరుపాలు, మద్దిలేటి, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బీడు భూములను సస్యశ్యామలం చేయాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - కొత్తపల్లి

రాష్ట్రానికే కొత్తపల్లి మండలం ఆదర్శమని ఈ మండల ప్రజలు రైతుల త్యాగాల ఫలితమే రాష్ట్రానికి వెలుగు రాష్ట్ర రైతులు సస్యశ్యామ లంగా ఉన్నారని మండలంలో ఎత్తిపోతల పథకాలు నిర్మించి బీడు భూములను సస్యశ్యామలం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నందికుంట గ్రామంలో జరుగుతున్న పల్లెకు పోదాం సమావేశంలో పాల్గొన్న జడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డి, ఎంపీపీ కుసుమలత ఎంపీడీవో మేరీ, మండల వైసీపీ కన్వీనర్ సుధాకర్ రెడ్డిలకు మండలంలో రైతుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ కొత్తపల్లి మండలం రైతుల త్యాగ ఫలితమే నేడు రాష్ట్రానికి వెలుగు అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో ఈ ప్రాంత రైతులు ప్రజలు భూము లతో పాటు సర్వస్వం కోల్పోవడం జరిగిందన్నారు. అలాగే గ్రామాల పక్కనే ఉన్న కృష్ణానది నీటిని ఈ ప్రాంత రైతులకు, పొలాలకు ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు తరలించకపోవడం బాధాకరమన్నారు. గతంలో సిపిఎం చేసిన పోరాటాల ఫలితంగా ముసలమడుగు గ్రామ శివారులో సంగమే శ్వరం శివపురం ఎత్తిపోతల పథకాలు చేసినప్పటికీ రైతులకు ఉపయోగపడక నిరుపయోగంగా మారడం జరిగిందన్నారు. నందికుంట గ్రామంలో నెలరోజుల వ్యవధిలోనే 2 రైతులు ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితి నెలకొందని, ఈ ఏడాది కొత్తపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడంపై రైతులకు తీవ్ర నష్టం నెలకొందన్నారు. కృష్ణా నది పక్కనే ఉన్న మండలంలోని మెట్ట భూములకు సాగునీరు అందడం లేదన్నారు. మండలంలో శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టేందుకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందించాలని కోరారు. జడ్డు వారి పల్లి వద్ద ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసి జడ్డు వారి పల్లి కొక్కెరంచ ఎదురుపాడు మెట్ట భూములకు సాగు నీళ్లు ఇవ్వాలని, సంగమేశ్వరం వద్ద కృష్ణానదిపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి మెట్ట భూములకు సాగునీరు ఇవ్వాలని, శివపురం ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులను నింపాలని, తదితర సమస్యలపై సంబంధిత అధికారులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేయాలని కోరారు. అనంతరం జెడ్పిటిసి మాట్లాడుతూ రైతు సంఘం నాయకులు రైతుల సమస్యలపై పోరాటాలు చేస్తున్న సమయంలో మేము కూడా మద్దతు తెలిపేందుకు సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, రైతు సంఘం నాయకులు వీరన్న ,రైతులు ప్రజలు ఉన్నారు..


వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

ఎన్‌టిఆర్ ఆశయాలను సాధిస్తాం : బుడ్డా

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు ఆశయాలను సాధి స్తామని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఈర్నపాడు గ్రామంలో బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడు తూ ఎన్‌టిఆర్ తెలుగంగ పథకాన్ని తీసుకువచ్చి అనేక మండలాలను సుభిక్షం చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వెలుగోడు రిజర్వాయర్లో నీళ్లు ఉన్న రెండో కారు పంటకు సాగునీరు ఇవ్వలేక కుంటి సాకులు చెబుతున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త రామలింగారెడ్డి కంచర్ల సురేష్ రెడ్డి, మనోహర్ చౌదరి, తాడికొండ బుగ్గ రాముడు, శక్తి కన్వీనర్ లక్ష్మీదేవి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పిట్టం రామకృష్ణారెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజల పాల్గొన్నారు.

14 నుండి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - పగిడ్యాల

56వ గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని పగిడ్యాల గ్రంథాలయ అధికారిని కే మద్దమ్మ కోరారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయంలో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించడం జరు గుతుందన్నారు. 56వ గ్రంథాలయ వారోత్సవాలకు విద్యార్థులు, నిరుద్యో గులు, గ్రామ పెద్దలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

అర్హులందరికీ పథకాలు అందాలి : ఎంపిపి

ప్రజాశక్తి - సంజామల

అధికారులు సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని ఎంపీపీ పోచ రమాదేవి అన్నారు. మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నాడు ఎంపీపీ పోచ రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పోచ రమాదేవి మాట్లాడుతూ మా నమ్మకము నీవే నీవే జగన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని అధికారులకు ప్రజాప్రతినిధులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థానానికి పచ్చళ్లు విరాళం



ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానానికి శుక్రవారం నాడు పలువురు పలు రకాలుగా విరాళంలో అందజేసినట్టుగా ఆలయ అధికారులు తెలిపారు. విరాళంలో అందజేసిన వారిలో అన్న ప్రసాద వితరణానికి బాపట్లకు చెందిన బి ఆనంద్ బాబు కుటుంబ సభ్యులు కలిసి రూ.1,00,500 సహాయ కార్య నిర్వహణ అధికారి ఫణిధర్ ప్రసాద్‌కు అందజేశారు. అదేవిధంగా హైదరా బాద్‌కు చెందిన ఐ సుబ్రహ్మణ్యం రూ.1,00,500 పర్యవేక్షకులు హిమ బిందువుకు అందజేశారు. హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీశైలం గౌడ్ 2 టన్నుల పచ్చళ్లను విరాళంగా అందజేశారు. విరాళంలో అందజేసిన పచ్చళ్లను అన్నప్రసాద వితరణలో భక్తులకు పంపిణీ చేసేందుకు అందజేయడం జరిగిందని వీటి విలువ సుమారు ఒక లక్ష,40,000 రూపాయలు ఉంటుందని దాతలు తెలిపారు. ఈ పచ్చళ్లను సహాయ కార్య నిర్వహణాధికారి మోహన్ పర్యవేక్షకులు మధుసూదన్ రెడ్డి ల సమక్షంలో అందజేయడం జరిగిందని ఆలయాధికారులు తెలిపారు.

ఘనంగా అటవీ అమరవీరుల దినోత్సవం

ప్రజాశక్తి - ఆత్మకూర్

అటవీ అమరవీరుల దినోత్సవ వేడుకలను అటవీ శాఖ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బైర్లూటిలో జరిగిన కార్యక్రమంలో అటవీ శాఖ డిఎఫ్ఓ ఆధ్వర్యంలో అమరవీరులకు సిబ్బంది నివాళులర్పించారు. అనంతరం అటవీ శాఖ సిబ్బంది ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామంలో వృద్ధులకు. ప్రభుత్వ వైద్య శాలలో చికిత్స పొందుతున్న వృద్ధులకు బాధితులకు పాలు బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఏపీపీ బాబు రాజేంద్రప్రసాద్, అటవీ శాఖ యూనియన్ నాయకులు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం : విధి నిర్వహణలో ఫారెస్ట్ శాఖలో పని చేస్తూ అమరవీరులైన వారి త్యాగాలు మరువలేనివని రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. శుక్రవారం రుద్రవరంలోని ఫారెస్ట్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా రుద్రవరం రేంజ్ అటవీశాఖ సిబ్బంది రుద్రవరం అటవీక్షేత్రధికారి వారి కార్యాలయం ఫారెస్ట్ అమర వీరుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగముగా విధి నిర్వహణ లో ప్రాణాలు కోల్పోయి అమరులు అయిన అటవీ అధికారులకి ఘనంగా నివాళులు అర్పించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అహోబిలం డిఆర్ఓ ముత్తు జావలి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసరెడ్డి, మక్తర్ భాష, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ప్రొటెక్షన్ వాచర్లు రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.


రుద్రవరం : ఫారెస్ట్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న అధికారులు

ప్రగతిని వివరించేందుకే 'పల్లెకు పోదాం'


మాట్లాడుతున్న వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి

(5వ పేజీ తరువాయి...)

ఎంపిటిసి వెంకటరమణ, పులి ప్రకాష్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర రెడ్డి ఎం కె నాయుడు, ఎం శివరాం రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సుబ్బరాయుడు, మాజీ సర్పంచ్ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్:** నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని 3, 24వ వార్డులలో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగాగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కిషోర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ రాహత్ జబ్బార్, వైసిపి పట్టణ అధ్యక్షులు షేక్ మన్సూర్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ అబూబక్కర్, 3వ వార్డు కౌన్సిలర్ అల్లూరి కృష్ణ, 24వ వార్డు కౌన్సిలర్ చాంద్ బాషల అధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఇంటి ఇంటికి వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అని ప్రజలకు వివరించారు. **బండి ఆత్మకూర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మళ్లీ జగనన్న అనే ముఖ్యమంత్రి కావాలని బండి ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దే రెడ్డి చిన్న సంజీవరెడ్డి అన్నారు. సచివాలయం టు పరిధిలో జరిగిన పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒక సచివాలయం పరిధిలోనే రూ. 25 కోట్లు నిధులు రావడం జరిగిందని గ్రామస్థాయి నుండి పరిపాలన సాగించడం కోసం సచివాలయం వ్యవస్థను తీసుకురావడం జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ వైసిపిని ఆశీర్వదించాలని, అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి పల్లెనిద్రలో భాగంగా బండి ఆత్మకూరు సచివాలయం టు పరిధిలోనే గృహసారథులు కన్వీనర్లు ప్రజాప్రతినిధులు పల్లెనిద్ర చేశారు. మండల వైసిపి కన్వీనర్ శ్రీనివాస్ రెడ్డి, జెసిఎస్ మండల పుల్లారెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు బూరం శివలింగం, పిట్టం పెద్ద రామ సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ రాజం రెడ్డి, సుజాతమ్మ ప్రజలు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** బేతంచెర్ల పట్టణం, గ్రామాలలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని చూసి వైయస్సార్ పార్టీకి అధికారం ఇచ్చి ఆదరించాలని బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి అన్నారు. బేతంచెర్ల పట్టణం 2వ సచివాలయం పరిధిలో పట్టణ కన్వీనర్ ఎస్ కాజా ఆధ్వర్యం లో ఎపికి జగనే సీఎం ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోకమిషనర్ రమేష్ బాబు వైఎస్ఆర్సిపి నాయకులు గూని నాగరాజు, సింగల్ విండో అధ్యక్షుడు రుద్రవరం నారాయణ,రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ మురళీకృష్ణ, టౌన్ కన్వీనర్ కాజా, టౌన్ సచివాలయాల కన్వీనర్ ఆజాం,టౌన్ అధ్యక్షులు డక్కి శేఖర్, కౌన్సిలర్లు జస్వంత్, చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కొలిమిగుండ్ల : మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి


బండి ఆత్మకూర్ : పల్లెకు పోదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ దే రెడ్డి చిన్న సంజీవరెడ్డి


బేతంచెర్ల : మట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

ప్రతి గడపకు ప్రభుత్వ పథకాలు

- వైసిపి మండల అధ్యక్షులు రవి యాదవ్


మాట్లాడుతున్న వైసిపి మండల అధ్యక్షులు రవి యాదవ్

నందికొట్కూరు : ప్రతి గడపకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని వైసిపి నందికొట్కూరు మండల అధ్యక్షులు రవి యాదవ్ అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో ఎపికి జగనన్నే ఎందుకు కావాలి నిర్వహించారు. ముఖ్య అతిథులు నందికొట్కూరు మండల అధ్యక్షులు రవి యాదవ్, మండల జెసిఎస్ కన్వీనర్ ఓంకార్ రెడ్డి పాల్గొని సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షులు రవి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిలో భాగంగా దాదాపు రూ.20 కోట్లను వివిధ రకాల పథకాల రూపంలో అల్లూరు గ్రామ ప్రజలకు అందించారని అన్నారు. రాబోయో ఎన్నికల్లో నియోజకవర్గంలోనే కాక రాష్ట్రం మొత్తంలో వైసిపి జెండా ఎగరవేస్తామని ఆశ భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరు గ్రామ వైసిపి సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి నందికొట్కూరు మండల ఎంపీపీ మురళి కృష్ణ రెడ్డి, జడ్పిటిసి కలిమునిసా నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ రాహత్ జబ్బార్, బ్రాహ్మణ కొట్కూరు సింగిల్ విండో చైర్మన్ మద్దూరు సతీష్ రెడ్డి, నందికొ ట్కూరు సింగిల్ విండో చైర్మన్ లక్ష్మి కాంతరెడ్డి, ముఖ్య నాయకులు వెంకటే శ్వర రెడ్డి,అల్లంపూర్ రవీంద్ర నాయుడు, రామలింగం నాయుడు, వెంకట స్వామి, పాపన్న, గ్రామ పెద్దలు నడిపి మద్దిలేటి,


విద్యార్థులు టపాకాయలు కాలుస్తున్న దృశ్యం

కెవి సుబ్బారెడ్డి పాఠశాలలో దీపావళి వేడుకలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని కెవి సుబ్బారెడ్డి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఓబన్న ఆధ్వర్యంలో ముందస్తు దీపావళి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు చిన్నారులతో కలిసి పాఠశాల ఆవరణంలో దీపాలు వెలిగించి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఓబన్న విద్యార్థులకు దీపావళి పర్వదినం గురించి వివరించారు. అలాగే బాణసంచా కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. దీపావళి పండుగ అంధకారాన్ని పారద్రోలి వెలుగును ప్రసాదిస్తుందన్నారు. అజ్ఞానాన్ని రూపుమాపి జ్ఞానాన్ని పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కాలర్ స్కూల్‌లో

నందికొట్కూరు టౌన్ : నందికొట్కూరు పట్టణంలోని పగిద్యాల రోడ్డు నందు గల స్కాలర్ స్కూల్ నందు శుక్రవారం నాడు ముందస్తు దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు శ్రీకృష్ణుడు సత్యభామ నరకాసుర వేషధారణలో



నరకాసుర వధ నాటకమును ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ కాలూరి లక్ష్మి విద్యార్థులకు దీపావళి పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం బాణసంచా కాల్చి ఆనంద ఉత్సాహాలతో దీపావళి పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కాలూరి శివప్రసాద్, ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.